ఆందోళన కలిగిస్తున్న పీ-4 సర్వే

- వివరాలు తెలిపేందుకు నిరాకరిస్తున్న పట్టణవాసులు
- లోపభూయిష్టంగా జరుగుతున్న సర్వే
- 32 వేల ఇళ్లకు ప్రస్తుతం చేసింది మూడు వేలే
- 18తో ముగియనున్న సర్వే

తెనాలిఅర్బన్: పేదరిక నిర్మూలన పేరిట ప్రభుత్వం నిర్వహిస్తున్న పీ–4 సర్వేకు ప్రజల నుంచి స్పందన కరువైంది. సచివాలయ ఉద్యోగులు ఇళ్లకు వెళ్లి వంట గ్యాస్, కరెంట్, ఏసీ, ఫ్రిజ్, కుళాయి కనెక్షన్‌లు, టీవీ తదితర వస్తువుల వినియోగంపై వివరాలు అడిగిన వెంటనే ప్రజలు సర్వే చేసే ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇవ్వకపోగా వీటిని పూర్తిగా తీసివేసేందుకు ఇలాంటి వివరాలు సేకరిస్తున్నారా అంటూ అసహనం వ్యక్తం చేస్తు సర్వేకు నిరాకరిస్తున్నారు. దీంతో సచివాలయ ఉద్యోగులు చేసేదిలేక తమ వద్ద గతంలో ఉన్న వివరాలను యాప్‌లో పొందుపరిచి ''మమ'' అనిపిస్తున్నారు. పేదరిక నిర్మూలన, ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయటం, ఉపాధి అవకాశాలు కల్పించటం, ఆర్థిక సాయం చేయటం వంటి లక్ష్యంతో


పట్టణంలో సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

రాష్ట్ర ప్రభుత్వం పీ–4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్ షిప్) సర్వేను చేయాలని సచివాలయ ఉద్యోగులను ఈ నెల 8న ఆదేశించింది. ఎంపిక చేసిన ఇళ్లకు వెళ్లి పీ–4 సర్వేలో పొందుపరచిన వివరాలు సేకరించాల్సి ఉంటుంది. దీనిని ఈ నెల 18వ తేదీతో ముగించాలని సూచించింది. తెనాలి పట్టణంలో 32,832 ఇళ్లను సర్వే చేయాలని పేర్కొంది. దీంతో తెనాలి పట్టణంలోని 47 సచివాలయాల పరిధిలోని వెల్ఫేర్ సెక్రెటరీలు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి వారి వివరాలు సేకరించి యాప్‌లో వాటిని పొందుపరుస్తున్నారు.

సర్వేలో ఉద్యోగులు అడిగే ప్రశ్నలు ఇవి...

కుటుంబ యజమాని పేరు, ఆధార్, సెల్ నెంబర్, సభ్యులు చేసే పని వివరాలు, నెలకు వారి ఆదాయం, డిగ్రీ, ఆపైన చదివిన వారి వివరాలు, వ్యవసాయ భూమి, ఇతర ఆస్తుల వివరాలు, ఇంటి స్థితి, వంట గ్యాస్, కుళాయి కనెక్షన్, టీవీ, రిఫ్రిజిరేటర్, ఏసీ, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం వివరాలు, కుటుంబ నెలవారీ ఖర్చు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే పథకాల వివరాలు వంటి వాటిని ఉద్యోగులు సేకరిస్తున్నారు.

పదిశాతం కూడా పూర్తికాని సర్వే

తెనాలి పట్టణంలో దాదాపు రెండు లక్షల జనాభా నివశిస్తున్నారు. సుమారు 60 వేల నివాస గృహాలు ఉన్నాయి. కానీ ప్రభుత్వం పీ-4 సర్వేను కేవలం 32,832 నివాసాలను మాత్రమే సర్వే చేయాలని సూచించింది. దీంతో సచివాలయ ఉద్యోగులు ఎంపిక చేసిన నివాసాలకు వెళ్లి సర్వే చేస్తున్నారు. ప్రస్తుతం 3001 ఇళ్ల సర్వే పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు. అంటే సుమారు పది శాతం సర్వే తెనాలిలో పూర్తి అయింది.

సర్వేను నిరాకరిస్తున్న ప్రజలు

తెనాలి పట్టణంలో జరుగుతున్న పీ 4 సర్వే లోపభూయిష్టంగా జరుగుతోంది. సర్వేలో పొందుపరిచిన వివరాలు చెప్పేందుకు ప్రజలు నిరాకరిస్తున్నారు. అంతేకాకుండా సర్వేకోసం తమ ఇళ్లకు రావద్దని ఉద్యోగులకు సూచిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అందేవని, వాటిని అమలు చేయకపోగా ఉన్న ప్రస్తుతం వస్తున్న రేషన్, గ్యాస్ వంటి వాటిని కూడా తీసేస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. తాము వివరాలు చెప్పమని కరాఖండిగా చెబుతున్నారు. చేసేదిలేక ఉద్యోగులు సేకరించిన వివరాలు దానిలో పొందుపరుచుతున్నారనే ఆరోపణ వినిపిస్తోంది.

18 లోగా పూర్తి చేస్తాం



పేదరిక నిర్మూలన చేసేందుకు ప్రభుత్వం పీ-4 సర్వేను నిర్వహిస్తోంది. ఈనెల 8 నుంచి పట్టణంలో సర్వే జరుగుతుంది. వారం రోజుల్లో సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సచివాలయాల పరిధిలోని ఉద్యోగులను బృందాలుగా ఏర్పాటు చేసి సర్వేను వేగవంతం చేశాం. సర్వేలో ఎదురయ్యే చిన్న, చిన్న లోపాలను అధిగమిస్తా.

–బండి శేషన్న, కమిషనర్

విద్యా సామగ్రి పంపిణీ



మున్నంగి(కొల్లిపర): మండల పరిధిలోని మున్నంగి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం మైగాడ్ శ్రీనివాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మిరియాల యాకోబ్ చేతుల మీదుగా పరీక్ష ప్యాడ్‌లు, స్కేళ్లు, పెన్నులు, పెన్సిల్స్, రబ్బర్, మెండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాకోబ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, పేద ప్రజల చదువు కోసం తమ ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.10వ తరగతిలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి ఆందోళనలకు గురికాకుండా ధైర్యంగా ఉండి తొలుత ప్రశ్నాపత్రం పూర్తి చదువుకొని అర్థం చేసుకుని వచ్చిన ప్రశ్నలు ముందుగా సమాధానాలు రాయాలని సూచించారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులు తెచ్చుకోవాలని కోరారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు పి.అప్పారావు, విద్యార్థులు విద్యాసామగ్రి అందించిన యాకోబ్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాంబశివరాజు, సాబీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

20 నుంచి స్వచ్ఛ తెనాలి ఛాలెంజింగ్ కాంపిటీషన్

తెనాలిఅర్బన్: స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పట్టణంలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు స్వచ్ఛ తెనాలి ఛాలెంజింగ్ కాంపిటీషన్‌ను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో ప్రతి రోజు డోర్ టు డోర్ కలెక్షన్, పరిసరాల శుభ్రత, పారిశుధ్య కార్మికుల హాజరు, పరిశుభ్రతపై ప్రజల స్పందన వంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. 40 వార్డుల పరిధిలోని శానిటేషన్ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికుల పనితీరును దీనిలో పరిశీలించనున్నట్లు చెప్పారు. 100 మార్కులు సాధించిన వారికి ప్రథమ బహుమతి కింద రూ.15,000/-, ద్వితీయ బహుమతికి రూ.12,000/, తృతీయ బహుమతికి రూ. 10,000/- అందజేయడంతో అప్రిసియేషన్ సర్టిఫికెట్‌ను అసిస్టెంట్ కలెక్టర్ పంపిణీ చేస్తారని చెప్పారు.

దంతాల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోండి

తెనాలిఅర్బన్: దంతాల సంరక్షపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని షైన్ డెంటల్ క్లినిక్ వైద్యులు డాక్టర్ నాగసాయిరెడ్డి పేర్కొన్నారు. చెంచుపేటలోని అంబియంట్ ఇంగ్లిషు మీడియం స్కూల్లో షైన్ డెంటల్ క్లినిక్ సహకారంతో గురువారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ షేక్ ఇర్షాద్, డైరెక్టర్ షేక్ సల్మా, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా



తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ పరిధిలోని పండ్లు, కూరగాయాలు మార్కెట్‌లు చేపలు, మాంసం మార్కెట్ల వేలం పాటను గురువారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. వివిధ పాటలకు ఒక్కొక్క పాటదారుడు రావడంతో దానిని వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ప్రకటించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగనాథ్, రెవెన్యూ ఆఫీసర్ రాంప్రసాద్, పలువురు వ్యాపారులు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం



తెనాలిఅర్బన్: ఈ నెల 17 నుంచి పదోవ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిదని డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ గురువారం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చదివిన విద్యార్థులకు తమ హాల్ టిక్కెట్లను చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. పరీక్షలు ముగిసే వరకు ఈ సదుపాయం ఉంటుందన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



మున్నంగి(కొల్లిపర): మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో గురువారం లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వాముల వారి కళ్యాణ మహోత్సవం భక్తుల సమక్షంలో ఆలయ అర్చకులు, వేద పండితులు వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి మండలంలోని వివిధ గ్రా మాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్య లో పాల్గొని స్వామి వార్ల కల్యాణం తిలకించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. దేవాలయ ప్రాంగణంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన

తెనాలిటౌన్: వైద్యారోగ్యశాఖ జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం సహకారంతో సిరి మహిళా సాధికార సొసైటీ ప్రతినిధులు మహిళలకు కుటుంబ అభివృద్ధి పై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక పాండురంగపేటలోని సొసైటీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యాయవాది ఎ.రాజ్యలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ టి.విజయ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నేటి ఆధునిక సమాజంలో మహిళలు ఉన్నతమైన ఆలోచనలు కలిగి ఉండాలని సూచించారు. తద్వారా కుటుంబ ఆర్థికాభివృద్ధికి మనం తీసుకున్న మంచి ఆలోచనలు దోహదపడతాయని తెలియజేశారు. పొదుపుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. చేతివృత్తుల ద్వారా అదనపు ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. అధ్యక్షులు వై.చంద్రకుమార్, కోశాధికారి సిహెచ్.లక్ష్మి, పీడీలు పరిమళ, ఎన్‌వీ రమణ, ఐటీ ప్రాజెక్టు మేనేజర్ ఎం.రవీంద్రబాబు, శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తెనాలిని తీర్చిదిద్దుదాం

అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్

తెనాలిఅర్బన్: ప్లాస్టిక్ రహిత పట్టణంగా తెనాలిని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నలు పిలుపునిచ్చారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛతా దివాస్ కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీనికి అసిస్టెంట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెనాలి పట్టణంలో అనేక మంది వ్యాపారులు 120 మైక్రాన్‌ల లోపు మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను విక్రయిస్తున్నట్లు తెలిపారు. వాటిని విక్రయించవద్దని సూచించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా అనేక దుకాణాలపై దాడులు చేసి ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను సీజ్ చేసి అపరాధ రుసుము విధించడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జానపనార, క్లాత్ సంచులను ఉపయోగించాలని సూచించారు. ఈ నెల 15వ తేదీన తెనాలి పట్టణంలోని శివాజీచౌక్, మున్సిపల్ కార్యాలయం వద్ద ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కెజీ ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను ఇచ్చి వాటి స్థానంలో టమోటా, గుడ్లు, పంచదార, పాలు వంటి వస్తువులను తీసుకు వెళ్ళాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు, ఆర్‌వో రాంప్రసాద్‌లు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వలన అనేక అనర్థాలు ఉన్నాయని చెప్పారు. అవి పర్యావరణానికి హానీ కలిగిస్తాయని, వాటిని ఉపయోగించడం వలన భావితరాలకు కలుషిత వాతావరణాన్ని అందించిన వారు అవుతామని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, నగరదీపికలు, ఆర్‌పీలు, మెప్మా ఉద్యోగులు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్

మూడు కంపెనీలకు 163 మంది ఏఎస్‌ఎన్ విద్యార్థులు

తెనాలి: స్థానిక ఏఎస్‌ఎన్ డిగ్రీ కాలేజీకి చెందిన 163 మంది డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన 'కమ్యూనికేషన్ ట్రైనింగ్ డొమైన్'కు ఎంపికయ్యారు. 'ఈ ఫోర్ యూ' కంపెనీకి 78 మంది, ఈఎస్‌ఎల్‌కు 30 మంది, స్పీకింగ్ ట్రీ కంపెనీకి 55 మంది ఎంపికైనట్టు ఏఎస్‌ఎన్ విద్యాసంస్థల ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. ఇంగ్లీష్‌లో కమ్యూనికేషన్ స్కిల్స్ ట్రైనింగ్ ఇవ్వగల అభ్యర్థులకు రాగల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఇచ్చిన శిక్షణ ఫలితంగానే తమ విద్యార్థులు ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలకు ఎంపికైనట్టు గురువారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు. వీరికి వేతనం నెలకు రూ.18 వేల నుంచి రూ.21 వేల వరకు నిర్ణయించారని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాబోయే దశాబ్దంలో ఈ డొమైన్‌కు ప్రాధాన్యత పెరుగుతుందని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. పెరుగుతున్న ఆర్థిక మాంద్య పరిస్థితుల్లోనూ తమ విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలను సాధిస్తుండటం గర్వకారణమన్నారు. ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ కాలేజీలో చదివే ప్రతి విద్యార్థి ఉద్యోగంతో బయటకు వెళ్లాలనే ఆశయానికి తగినట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.



ఎంపికైన విద్యార్థులతో శివకుమార్, డాక్టర్ రామ్‌చంద్

రెండు ఉన్నత పాఠశాలలకు 'రోటరీ' సేవలు

ప్రారంభోత్సవంలో పాల్గొన్న డిస్ట్రిక్ట్ గవర్నర్

తెనాలి: పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పలు సేవాకార్యక్రమాలను నిర్వహించారు. రోటరీక్లబ్ జూబ్లీ హిల్స్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సంయుక్తంగా బీజీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ వారి సీఎస్సార్ నిధులతో స్థానిక అయితానగర్‌లోని ఎస్‌ఎస్‌ఎస్ మున్సిపల్ హైస్కూలులో మంచినీటికోసం ఏర్పాటుచేసిన బోరు, మోటారును ప్రారంభించారు. బీరువాలను బహూకరించారు. అనంతరం కొత్తపేటలోని మున్సిపల్ బాలుర హైస్కూలులో డైనింగ్ హాలు ఆధునికీకరణను ప్రారంభించారు. రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ సోమవరపు రామప్రసాద్, జూబ్లీ హిల్స్ రోటరీ అధ్యక్షుడు విసిరెడ్డి బాలకోటిరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తెనాలి రోటరీ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఇదే సభలో ఇటీవల రోటరీ క్లబ్ తెనాలి, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా కళాకారుల కోసం నిర్వహించిన ఉచిత కంటివైద్యశిబిరంలో అవసరమైన 73 మందికి కళ్లజోళ్లను అందజేశారు.


కళాకారులకు కళ్లజోళ్ల పంపిణీలో జయలక్ష్మి, రామప్రసాద్, బాలకోటిరెడ్డి

'వీరస్థలి తెనాలి' డాక్యుమెంటరీలో నటించిన దర్శి జీవన్, గుంటుపల్లి వసంతయామినిలను సత్కరించారు. రోటరీ పాస్ట్ గవర్నర్లు అన్నే రత్న ప్రభాకర్, తాళ్ల రాజశేఖర్ రెడ్డి, స్కూల్ హెచ్‌ఎం మీరాబి, తెనాలి కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి మాట్లాడారు. రోటరీ డిస్ట్రిక్ట్ టూల్స్ కనీవ్వనర్ నన్నపనేని బాలకష్ణ, తెనాలి రోటరీ సభ్యులు ఈదర వెంకట పూర్ణచంద్, గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళీకష్ణ, నల్లూరు వెంకటేశ్వరరావు, జగదీశ్వరాంబ, గుత్తా వెంకటలక్ష్మి, జీవీ నారాయణ, కాకుమాను ఉపేంద్ర పాల్గొన్నారు.

బాలస్వామికి పలువురు అభినందన



తెనాలి: పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలోని శ్రీవాసవీ పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) ఈనెల 15వ తేదీనుండి చేపడుతున్న 'తిరుమల మహాపాదయాత్ర'ను ముందుగా తెనాలిలో 'గురు పాదధూళి' కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రతిరోజూ ఉదయం ఆరు గంటలకు స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం శ్రీసాలిగ్రామ పీఠం నుండి బయలుదేరి బుర్రిపాలెం రోడ్డులోని గోశాల వరకు పాదయాత్ర చేస్తున్నారు. తిరుమల మహాపాదయాత్ర రోజువరకు కొనసాగే గురు పాదధూళి పాదయాత్రలో గురువారం హైకోర్టు న్యాయవాది మేకల రవికుమార్ బాలస్వామిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఆర్యవైశ్య పట్టణ కమిటీ మాజీ అధ్యక్షుడు కొణిజేటి గోపీకృష్ణ, శ్రీసాలిగ్రామ పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆటోల నిలుపుదలపై ఆగ్రహం

- 'సాక్షి' కథనానికి స్పందన
- మార్కెట్ వంతెన వద్ద చర్యలు చేపట్టిన పోలీసులు

సాక్షి ఎఫెక్ట్

తెనాలిరూరల్: 'ట్రాఫిక్ కష్టాలు తీరేదెలా?' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. పట్టణంలో కీలకమైన మార్కెట్ కూడలి వద్ద రోడ్డు వెంబడి యథేచ్ఛగా ఆటోలను నిలుపుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న వైనం గురించి కథనంలో ప్రస్తావించిన సంగతి తెలిసిందే. దీనికి పోలీసులు స్పందించి మార్కెట్ కూడలి వద్ద ముఖ్యంగా ఇక్కడి యూ–టర్న్ వద్ద ఆటోలు నిలపడంపై పోలీసులు గురువారం ఆంక్షలు విధించారు. ఇక్కడ ఆటోలను నిలపకూడదని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలు అమలవుతున్న తీరును ట్రాఫిక్ ఎస్‌ఐలు రాజ్యలక్ష్మి, బ్రహ్మయ్యలు స్వయంగా పర్యవేక్షించారు. ఆటోలు అడ్డుగా లేకపోవడంతో మార్కెట్, మున్సిపల్ కార్యాలయం వైపు నుండి వచ్చే వాహనదారులు పాదచారులు ఇబ్బందులు లేకుండా వెళుతున్నారు. ఇదిలా ఉంటాఏ మార్కెట్ వంతెన, యూ–టర్న్‌ల వద్ద ఆటోల నిలుపుదలపై పోలీసులు ఆంక్షలు పెట్టడంతో మార్కెట్ వంతెన, కొత్త వంతెనల మధ్య ఉన్న బస్‌షెల్టర్ వద్ద ఇవే ఆటోల వలన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు ఆగే బస్‌షెల్టర్ వద్ద ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


ఆటోలు లేకపోవడంతో విశాలంగా కనిపిస్తున్న రోడ్డు

దాతల సహకారం అభినందనీయం

తెనాలిటౌన్: దాతల సేవానిరతి అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాచర్ల నాగేశ్వరరావు కొనియాడారు. రూరల్ మండలం కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోవ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు గురువారం గ్రామానికి చెందిన దాత సహకారంతో పరీక్ష మెటీరియల్ పంపిణీ నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ కమిటీ చైర్మన్ షేక్ జిలానీ బాషా, గ్రామ పెద్దలు ఎం.వెంకటేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేశారు. పట్టుదలతో చదువుకుని పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి పదోవ తరగతి మార్కులు కొలమానికంగా ఉంటాయని వెల్లడించారు. సమయానికి ఆహారం, నిద్ర అవసరమని తెలిపారు.


విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న దాతలు

ఇష్టపడి చదివి విద్యలో ఉన్నతంగా రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.బాల నాగయ్య నాయక్, అడుసుమల్లి పద్మ, మత్తై అన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విభాలీఫ్ ఫర్‌వర్డ్ పోటీల్లో కీర్తి ప్రియకు ద్వితీయ స్థానం



అత్తోట(కొల్లిపర): భవానీపురం, విజయవాడలో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి విభా లీఫ్ ఫర్‌వర్డ్ చాంపియన్ షిప్ పోటీల్లో గుంటూరు జిల్లాలోని కొల్లిపర మండల పరిధిలోని అత్తోట గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఏఈ)లో 3వ తరగతి చదువుతున్న గ్రామానికి చెందిన దండా కీర్తి ప్రియ ద్వితీయ స్థానం సాధించినట్లు మండల విద్యాశాఖాధికారి జి.సాల్మన్‌రాజు , ఝాన్సీలత ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా రామచంద్రస్వామి పట్టాభిషేకం

తెనాలి: స్థానిక కొత్తపేటలోని తాలూకా హైస్కూల్ గ్రౌండ్ వేదికగా అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞ పూర్ణాహుతి మహోత్సవాలు విశేషంగా కొనసాగుతున్నాయి. ఈనెల 14 వరకు నిర్వహించే ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా గురువారం, శ్రీ సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం శాస్త్రోక్తంగా జరిపించారు. వైఖానస ఆగమ పండితులు నారాయణం గోవర్ధన్ లక్ష్మీ రఘురాం, వేదాంతం నాగమారుతి, రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ఆర్‌వీ కిరణ్, సురేష్ బృందం వైదిక క్రతువును నిర్వహించింది. ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ శిల్ప భక్తుల నుద్దేశించి మాట్లాడారు. శ్రీసీతారాముల కళ్యాణం, శ్రీసీతారామచంద్రస్వామి పట్టాభిషేకం విశిష్టతను భక్తులకు తెలియజెప్పారు. సాయంత్రం ఏడు గంటలకు ప్రముఖ ప్రవచనకర్త, పద్మశ్రీ అవార్డుగ్రహీత డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. శ్రీరామనామ మహిమను శ్రీరాముడి ఔన్నత్యాన్ని ఆయన సోదాహరణంగా వివరించారు. రోజంతా జరిగిన కార్యక్రమాలకు బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాధశర్మ వాఖ్యానం చేశారు. భగవద్ రామానుజ దాసుడు జంధ్యం రామారావు దంపతులు కార్యక్రమాల నిర్వహణకు భక్తిపూర్వక సహకారం అందించారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నప్రసాద వితరణను ఏర్పాటుచేశారు. శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవాసమితి, శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి అనురాధ, వెంకటేశ్వరరావు,గుడివాడ బాలకృష్ణ, మడుపల్లి చంద్రశేఖర్, మాజేటి వెంకటేష్, గోలి సోమశేఖర్ పర్యవేక్షించారు.


శ్రీసీతారామచంద్రస్వామి పట్టాభిషేకం జరిపిస్తున్న పండితులు

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

తెనాలిటౌన్: డోనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూరల్ మండలం ఖాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోవ తరగతి విద్యార్థులకు గురువారం సేవా కార్యక్రమం చేపట్టారు. సంస్థ కార్యదర్శి దేవరాజు పాల్గొని విద్యార్థులకు పరీక్షకు అవసరమైన మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. పేబ్యాక్ టు ది సొసైటీ అనే నినాదంతో 2019లో సామాజిక సేవా దృక్పథంతో సంస్థను స్థాపించి అన్నదానం, ఉచిత వైద్య శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు రాజీవ్ నాయక్ మాట్లాడుతూ యువకులు స్వచ్ఛంద సేవా సంస్థను ప్రారంభించి విద్యార్థులకు అవసరమైన పరీక్ష మెటీరియల్‌ను అందించడం ముదావహమని కొనియాడారు. యువత బాధ్యతతో సమాజానికి సేవలు అందించడం ప్రతి ఒక్కరూ ఆదర్శనీయంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మిరియాల రాజ్‌కుమార్, జొన్నలగడ్డ ఆదర్శ్, ఉపాధ్యాయులు ఎస్‌కె ఎండీ రావూఫ్, ఆదిలక్ష్మి, స్థానికులు ఎస్.వినయ్‌కుమార్, సి.హెచ్. నాగరాజు పాల్గొన్నారు.


మెటీరియల్ అందజేస్తున్న సభ్యులు

22లోపు దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: బీసీ కార్పొరేషన్ ద్వారా వ్యక్తిగత రుణాల కోసం ఈ నెల 22 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో సూచించారు. బీసీ కార్పొరేషన్ పరిధిలో బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు, బలిజ, తెలగ, ఒంటరి, కమ్మ, రెడ్డి, వైశ్యాస్, బ్రాహ్మణ, క్షత్రియ కులాలకు సంబంధించిన వారు ఉన్నారని తెలిపారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఆదాయ, కుల ధృవపత్రంతో మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ నెల 11వ తేదీ నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. వివరాలకు పురపాలక సంఘ కార్యాలయంలో మెప్మా విభాగంలో సంప్రదించాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం


సామగ్రిని అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం మౌళాలి, పూర్వ విద్యార్థులు

తెనాలిఅర్బన్: పాఠశాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు అభినందనీయులని ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌళాబి పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో పదోవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిల్‌లు, స్కేల్, హాల్‌టిక్కెట్ కవర్ వంటి వాటిని పంపిణీ చేశారు. సంఘం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్, కంకిపాటి రమేష్‌కుమార్, ఈఎల్‌వీ అప్పారావు, చుక్కా భానుప్రసాద్, కెకె శ్రీనివాస్, శివభాస్కర్, సుబ్రమణ్యం, పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

తెనాలిరూరల్: ఒంటరిగా నివసిస్తున్న వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేట సంకా వారి కొట్ల సమీపంలో 70 ఏళ్ల ఎస్. సుబ్రహ్మణ్యం ఒంటరిగా నివసిస్తున్నాడు. ఇంటి నుంచి దుర్వాసన వస్తోందని స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా వన్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా మృతి చెంది పడి ఉన్నాడు. మృతి చెంది రెండు రోజులై ఉంటుందని భావిస్తున్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.